# విముక్తి

పక్కింట్లోని గోడ గడియారం పది గంటలు కొట్టింది. ఒంటరిగా కూచుని పరధ్యానంగా ఆలోచిస్తున్న సుశీల వులిక్కిపడింది. మొన్న మొన్నటి వరకూ తమ ఇంట్లో గోడ గడియారంవుండే చోటుకేసి దృష్టిని సారించింది.

బోడి గోడ సాక్షాత్కరించింది.

భర్త ఆ గడియారాన్ని తీసుకుపోయి తాకట్టు పెట్టి, ఆ డబ్బుతో తాగి తందనాలు ఆడడం ఇప్పటికీ సుశీలకి బాగా గుర్తుంది. అంతేకాదు. ఆ రోజు తాను ఆ గడియారాన్ని తాకట్టు పెట్టొద్దని భర్తని కాళ్ళా వేళ్ళా పడినందుకు, తన వొళ్ళు హూనమవ్వడం కూడా ఆమె మర్చిపోలేదు. ఆ సంఘటనలన్నీ స్మృతిపథంలో మెదిలేసరికి కళ్ళు చెమర్చినాయి. భారంగా ఓ నిట్టూర్పు మాత్రం వదిలింది.

అప్పుడే చదువు ముగించి, నులక మంచంపై పడుకున్న కొడుకు రాజుకేసి చూసింది సుశీల. వాడికి పరీక్షలు దగ్గర పడుతున్నాయి. వేకువ జామునలేచి చదవాలన్న సంకల్పంతో ఇప్పుడే పడుకున్నాడు. తండ్రి వ్యసనం, అయన వ్యవహారం ఆ అబ్బాయికి నచ్చలేదు. ఒక్కొక్కప్పుడు అవమాన భారంతో కృంగిపోతూ వుంటాడు కూడా. కాని వాడేం చెయ్యగలడు? రెండు మూడుసార్లు తనని నిలదీసి అడిగాడు.

"నాన్నగారు ఆ తాగుడు వ్యసనాన్ని ఎందుకు మానలేకపోతున్నారమ్మా? తాగొద్దని నువ్వయినా ఎందుకు చెప్పవు? కొందరు నాన్నగార్ని చూసి నవ్వుతూ వుంటే, హేళన చేస్తూ వుంటే నాకెంత అవమానకరంగా వుంటుందో తెలుసునా అమ్మా! కాని ఏం చెయ్యగలను? నవ్విన వాళ్ళతో తగూలాడలేను. ఆ అవమానాన్ని, ఆవేదనని నా గుండెల్లోనే దాచుకుని మొహం దించుకుంటున్నానమ్మా" అని ఎంతో బాధగా అడిగాడు.

కొడుకు వేసిన ప్రశ్నలకి, ఏం సమాధానం చెబుతుంది సుశీల? భర్త వ్యసనాన్ని మాన్పించగల శక్తి తనకి లేదని కొడుక్కి ఎలా నచ్చ జెబుతుంది?

"బాబూ! నువ్వింకా చిన్నవాడివిరా. నీకీ విషయాలన్నీ ఎందుకు చెప్పు? నీకు తెలీదురా.... మీ నాన్నగారిచేత ఆ పాడు వ్యసనాన్ని మాన్పించాలని, ఎన్నో ప్రయత్నాలు చేశాను. బతిమిలాడాను, కోపగించుకున్నాను, హెచ్చరించాను అయినా ఫలితం లేకపోయింది. ఆయనలో రవ్వంతయినా మార్పురాలేదు. నేనే ఓడిపోయాననిపించింది. ఆయన ఆరోగ్యమూ క్షీణించిపోతోంది. ఆర్థికంగా మన ఇల్లా గుల్లవుతోంది. నువ్వడిగావు గాబట్టి ఇవన్నీ చెప్పానుగాని, అసలు నువ్వీ విషయాల్నే పట్టించుకోకూడదురా. నువ్వు బుద్ధిగా చదువుకుని ప్రయోజకుడివి కావాలి. మనం ఇప్పుడనుభవిస్తున్న కష్టాలకి, ఆవేదనకి ఓ పరిష్కారం, ఓదార్పు నీనుండే రావాలిరా. ఆ ఆశతోనే బతుకుతున్నాను" అంటూ కొడుకు తల నిమిరేది సుశీల. మొహం పక్కకితిప్పి కళ్ళొత్తుకునేది.

తల్లి అలా ఎన్నోసార్లు కంటతడి పెట్టుకోవడం రాజుకి తెలుసు. ఆమె ఎంత చాటుగా కంటతడి పెట్టుకున్నా, ఆ పదిహేడేళ్ళ

పసిహృదయం పసిగట్టకపోలేదు. అప్పుడప్పుడూ తండ్రిమీద వల్లమాలిన కోపం వస్తూ వుండేది. కాని ఏం చెయ్యగలదు?

అలా జ్ఞాపకాల్ని నెమరువేసుకుంటున్న సుశీలకి, తలుపు తట్టిన శబ్దం వినిపించింది.

భర్త వచ్చి వుంటాడన్న ఆశతో ఆత్రంగా వెళ్ళి తలుపు తెరిచింది ఎదురైన దృశ్యాన్ని చూసి నీరైపోయింది. భర్తని ఆయన స్నేహితు లిద్దరూ చెరో రెక్క పుచ్చుకుని తీసుకురావడం గమనించింది. గుండెలు గుభేలుమన్నాయామెకి. కళ్ళల్లో నీరు చిమ్మింది.

"ఏమయ్యిందండీ?" రుద్ధస్వరంతో ప్రశ్నించింది సుశీల.

"కంగారు పడకమ్మా! మైకంలో వున్నాడంతే! సారాకొట్టు దగ్గర రోడ్డుమీద పడివుంటే గుర్తుపట్టి తీసుకొచ్చాం. ఎంత చెప్పినా వీడీ వ్యసనాన్ని మానుకోవడం లేదు. మీరయినా కాస్త అదుపులో పెట్టడానికి ప్రయత్నించండి" అంటూ వాళ్ళు ఇద్దరూ గోవిందును మంచం దగ్గిరికి తీసుకొచ్చి, దానిపై పడుకోబెట్టారు.

సుశీల హృదయంలోంచి పెల్లుబుకొస్తోన్న దుఃఖాన్ని బలవంతంగా ఆపుకుంది. తన నిస్సహాయస్థితి వాళ్ళకి తెలీదనుకుంది.

"మీరు శ్రమ తీసుకుని మా వారిని ఇంటికి చేర్చారు. మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో అర్థం కావడం లేదండీ! రిక్షాకి ఎంతిచ్చారు?" వీధిలో రిక్షా చూసి అడిగింది.

"పరవాలేదులే అమ్మా! వీడేం పరాయివాడు కాదు. మా స్నేహితుడు. వీడు ఈ వ్యసనానికి బానిస కావడం వీడి దురదృష్టం, మీ దౌర్భాగ్యం. వస్తాం మరి" అంటూ వాళ్ళిద్దరూ వెనక్కి తిరిగి అక్కడున్న రిక్షాలోనే వెళ్ళిపోయారు.

సుశీల కళ్ళొత్తుకుంటూ తలుపు వేసుకుని లోపలికొచ్చింది. భర్త మంచం మీద అటూ ఇటూ ఒత్తిగిల్లుతూ వుండటం చూసి కాస్తంత పూరట చెందింది. చప్పున పోయి ఫ్లాస్కులో వున్న 'టీ' తెచ్చి భర్త చేత బలవంతంగా తాగించింది. టీ తీసుకున్నాక గాఢ నిద్రలోకి జారుకున్నాడు గోవిందు.

సుశీలకి మరి భోజనం చెయ్యబుద్ధి పుట్టలేదు. మంచం పక్కనే

చాప వేసుకుని చేరబడింది. ఆమె కంటికి నిద్రరాలేదు. పెళ్ళయిన కొత్తలో ఆయన ఎట్లా వుండేవారని? ఆనాటి రూపురేఖలే లేవు ఇప్పుడు. బక్కచిక్కి శిథిలావస్థలో వున్నట్టున్నారు. చాలా రోజుల్నించి ఇంటి గురించిగాని, ఇంట్లోని మనుషుల గురించిగాని ఆయన ఆలోచించడమే మానేశారు. క్రమంగా పెద్దవుతోన్న కొడుకు గురించి యోచించడమే లేదు. నిజంగా తాను ఎంత దురదృష్టవంతురాలు? తన ఆవేదన, తనలో రగులుతున్న అసంతృప్తిని, నిస్పృహను ఎవరితో చెప్పుకుంటుంది? అయితే నిరాశతో నిండిన తమస్సులో ఆశా జ్యోతిలా, ఒక్కగాని ఒక్క కొడుకు రాజు దేదీప్యమానంగా వెలుగుతున్నాడు. అది తన అదృష్టమే.... అలా అలా ఆలోచిస్తూ వుంటే నిద్రపట్టేసిందామెకి.

తెల్లవారింది—

మామూలుగానే లేచాడు గోవిందు. కాలకృత్యాలు తీర్చుకుని, అప్పుడే వచ్చిన దినపత్రికను తీసి చదువుతున్నాడు.

ఎనిమిది గంటలు కావస్తోంది.

రాజు ట్యూషనుకి వెళ్ళిపోయాడు.

సుశీల కాఫీ తీసుకొచ్చి భర్తకి అందించింది.

గోవిందు కాఫీ తీసుకుంటున్నాడు. భార్య అక్కడే నిల్చుండటం గమనించి, కాఫీగ్లాసు ఖాళీచేసి భార్యకి అందించాడు.

"మీరు రాత్రి ఏ స్థితిలో ఇల్లు చేరుకున్నారో గుర్తుందాండీ? మెల్లగా ప్రశ్నించింది సుశీల.

గోవిందు తలెత్తి భార్యకేసి తీక్షణంగా చూశాడు. అతని మనస్తత్వమే అంత. తను ఏం చేసినా, ఎలా ప్రవర్తించినా ఎవ్వరూ ప్రశ్నించకూడదు. అంతటి నిరంకుశ ప్రవృత్తి అతనిది.

"ఏ స్థితిలో వున్నానేంటి?" కటువుగానే అడిగాడు. నిజంగానే అడిగాడు. నిజంగానే అతనికేవీ గుర్తులేదు. గుర్తులేదని చెప్పడం ఇష్టం లేకపోయింది.

సుశీల బరువుగా ఓ నిశ్వాసం విడిచింది.

"మీరా మాయదారి సారాకొట్టు దగ్గర మైకంలో పడుంటే, మీ స్నేహితులిద్దరూ మిమ్మల్ని రిక్షాలో తీసుకొచ్చారు. మిమ్మల్ని కాస్త

అదుపులో పెట్టమని నన్ను హెచ్చరించి వెళ్ళారండీ! ఈ విధంగా మన పరువు వీధినపడ్డం ఏం బావుందండీ. నేను మాత్రం ఏం చేయ్యగలను చెప్పండి?" రుద్ధస్వరంతో అంది సుశీల.

గోవిందు మొహం జేవురించింది. "ఏడిశారు వెధవలు. గోరంత విషయాన్ని కొండంతగా చేసి చేబుతారు" కోపంగానే అన్నాడు.

భర్త కోపం సుశీలకి కొత్తకాదు. "వాళ్ళనెందుకండీ నిందిస్తారు? నిజంగానే మీరు వాళ్ళు తెలీని స్థితిలో ఇంటికి తీసుకురాబడ్డారు. అయినా వాళ్ళు చెబుతోంది మీ శ్రేయస్సుకే కదండీ? మీ ఆరోగ్యం ఎలా పాడవుతుందో గమనించారా? ఒకప్పటి మీ రూపురేఖలు ఇప్పుడేవీ? ఇక మన ఆర్థిక పరిస్థితి ఎలా దిగజారుతుందో మీరు సులువుగా అర్థం చేసుకోగలరు. మీకు నేను చేప్పాల్సినదాన్ని కానండీ! కాని...." అని ఇంకేమో అనాలనుకున్న సుశీల వాగ్ధాటికి అడ్డొచ్చాడు గోవిందు.

"స్టాపిట్....అక్కడితో ఆపు. నాకు చెప్పవల్సిన దానివి కావంటూనే ఏవేవో వల్లించేస్తున్నావు. నేనేవిటో నా పరిస్థితేమిటో, నా ఇంటి ఆర్థిక స్థితి ఏవిటో నాకు బాగా తెలుసు. నువ్వింకేమీ చేప్పనవసరం లేదు. నీచేత చెప్పించుకునేటంతటి దురవస్థకి దిగజారిపోలేదు నేనింకా. వెళ్ళు లోపలికి", గర్జించినట్టే అన్నాడు గోవిందు.

భర్తకి ఆవేశం వస్తే విచక్షణా జ్ఞానం కోల్పోతాడని సుశీలకి బాగా అనుభవమే. ఎర్రబారిన అతని మొహంకేసి చూసి ఓ నిశ్వాసం వదిలింది. పల్లెత్తుమాట అనకుండా అక్కణ్ణించి జారుకుంది. వంటగదిలో కూచుని మౌనంగా ఏడ్చింది. తన దురదృష్టానికి కుమిలిపోయింది. అనునిత్యం తనకీ ఆవేదన, తపన ఎప్పుడు తప్పుతాయా అన్న విసుగు పెరిగిందామెలో.

రాత్రి పదకొండు కావస్తున్నా, భర్త ఇల్లు చేరకపోయేసరికి కంగారు పడింది సుశీల.

ఆరాటంతో, ఆతృతతో, అచేతనంగా వీధి గుమ్మం దగ్గరే కూచుంది సుశీల. వళ్ళంతా కళ్లు చేసుకుని వీధికేసే చూస్తోంది.

పక్కింటి గడియారం పదకొండు గంటలు కొట్టడం స్పష్టంగా వింది సుశీల. భర్త ఇంకా రాలేదు. ఆమెలో ఆరాటం ఇనుమడించింది.

రాజా నిద్రపోతున్నాడు. వాణ్ణి మేల్కొలిపి ఎక్కడయినా వెదికి రమ్మని చెప్పి ఇబ్బంది పెట్టడం ఇష్టంలేక పోయింది సుశీలకి. అయినా వాడు మాత్రం ఎక్కడికి వెళ్ళి వెదుకుతాడని! ఏం చేయ్యాలో తోచక అయోమయావస్థలో కొట్టుకుంటోందామె.

పక్కింటి గడియారం పన్నెండు గంటలు కొట్టింది. వీధంతా నిర్మానుష్యంగా వుంది. అయినా సరే నిర్భయంగా గుమ్మంలోనే కూచుంది సుశీల. ఆమె మెదడులో ఏవేవో ఆలోచనలు, అనుమానాలు మెదిలి ఆమెను కలవర పరిచినాయి.

కొద్ది నిమిషాలు గడిచాయి.

కాస్తంత దూరంలో కుక్కలు అరుస్తున్నయ్. ఎవరో కొందరు వ్యక్తులు ఎవరినో మోసుకువస్తోన్న దృశ్యాన్ని చూసింది సుశీల. ఆమె గుండె జల్లుమన్నది. కొద్దిరోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తు కొచ్చింది. ఆమెకి హృదయ స్పందన అధికమయ్యింది. లేచినుంచుంది. ఆ గుంపు దగ్గరపడి, తమ ఇంటి ముందే ఆగడంతో, ఆమెకి గుండె ఆగిపోయినంత పనయ్యింది. ఆపాదమస్తకం వణికిపోయింది.

స్ట్రెచర్ మీదున్న వ్యక్తితోపాటు, వీధి అరుగుమీద దించారు స్ట్రెచర్ని. ఆనాడు వచ్చిన స్నేహితులిద్దరూ ఈనాటి గుంపులో వున్నారు. వాళ్ళందరి మొహాల్లోనూ విషాదం తాండవిస్తోంది.

"ఏమయ్యిందండీ?" రుద్దస్వరంతో ప్రశ్నించింది సుశీల.

"ఘోరం జరిగిపోయిందమ్మా! జరగకూడనిది జరిగింది. ఆనాడు జరిగినట్టుగానే, ఈరోజు కూడా సారాకొట్టుకి కాస్తంత దూరంలో రోడ్డు మీద పడున్నాడు వీడు. మేం రిహార్సల్సు నుంచి తిరిగివస్తూ వీణ్ణి చూద్దం తటస్థించింది. ఆరోజులానే మైకంలో వున్నాడని అనుకున్నాం. కాని, శరీరం కర్రగట్టిపోయి వుండటం గమనించాక మాకు మతులు పోయినయ్. రోడ్డుమీద వెళ్తున్న వాళ్ళ సహాయంతో హాస్పటల్ కి తీసుకు పోయాం. మీకు కబురు పంపడానికి వ్యవధి లేకపోయిందమ్మా! హాస్పటల్ కి వెళ్ళాక, డాక్టరు పరీక్షచేసి ప్రాణం పోయిందన్నాడు. అదీ

గంట క్రితమే జరిగి వుంటొచ్చునని నిర్ధారణ చేశాడు. ఏం చెయ్యడం? ఆ పరిస్థితుల్లో మిమ్మల్ని అక్కడికి రప్పించడం సబబు కాదనిపించింది. అందుకే వీళ్ళందరి సహాయంతో ఇక్కడికి తీసుకొచ్చాం. ఎవరు ఎంత చెప్పినా వినకుండా, వ్యసనానికి దాసుడై, చేతులారా నిండు ప్రాణాల్ని పోగొట్టుకున్న గోవిందుపట్ల సానుభూతే మిగిలిందమ్మా! అంతకంటే ఏమీ చెయ్యలేకపోతున్నాం. మీరు చాలా దురదృష్టవంతులు" అంటూ ఓ స్నేహితుడు కన్నీరు తుడుచుకున్నాడు.

సుశీల శిలా ప్రతిమలా అచేతనంగా వుండిపోయింది క్షణంపాటు. భర్త భౌతిక దేహంకేసి పిచ్చిగా చూస్తూ, ఒక్కసారి దుఃఖమంతా వెల్లువలా పెల్లుబుక్కురాగా ఆ నిర్జీవ దేహంపైబడి భోరున యేడ్చింది.

తల్లి యేడుపు విని, నిద్రలేచిన రాజు బైటికొచ్చాడు. ఆ దృశ్యాన్ని చూసి స్తంభించిపోయాడు. కన్నతండ్రి భౌతిక కాయాన్ని చూస్తూ భోరున యేడ్చాడు. ఎంతయినా కన్నతండ్రి కదా!

తెల్లారేసరికి, గోవిందు మరణవార్త విని చాలా మంది చేరారు. అతని దహన సంస్కారానికి స్నేహితులే అన్ని ఏర్పాట్లూ చేశారు.

పన్నెండు రోజుల తర్వాత, గోవిందు స్నేహితులు సుశీల దగ్గరికొచ్చారు.

సుశీల నిర్లిప్తంగా కూచునుంది. ఆమె ఫాలభాగం ఇప్పుడు బోసిపోయినట్టయింది. ఆమె తరపు బంధువులెవరో వచ్చినట్టున్నారు....వాళ్ళు కాస్తంత దూరంలో నుంచున్నారు.

"మీకు మావల్ల ఏ సహాయం కావాలన్నా చెప్పండమ్మా! మా చేతనయినంత మేరకు ప్రయత్నిస్తాం. గోవిందుకు రావల్సిన పైకం గురించి, అబ్బాయి వుద్యోగ విషయం– ఎలాగో ప్రయత్నాలు చేస్తున్నామనుకోండి" అన్నాడో స్నేహితుడు.

సుశీల భారంగా ఓ నిట్టూర్పు విడిచింది. ఆమె కళ్ళల్లో అప్రయత్నంగా నీరు చిమ్మింది. చీర చెరగుతో కళ్ళొత్తుకుంది.

"మీరంతా చాలా శ్రమ తీసుకున్నారండీ! నా వాళ్ళంటూ ఇక్కడ ఎవ్వరూ లేకపోయినా, ఆ లోటును తీర్చి మా ఆయన పట్ల మీ స్నేహ

ధర్మాన్ని నిర్వర్తించారు. అందుకు నా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. మావారు నిర్లక్ష్యంగా ప్రవర్తించి తన వ్యసనానికి బలైపోయారు. ఇటీవల ఆయన్ని నిత్యం మైకంలో చూసి, నా దురదృష్టానికి ఏడ్చేదాన్ని. కన్నీరు కార్చడం నా దినచర్య అయ్యింది.

మా అబ్బాయి తండ్రిని చూసి బాధపడుతూ వుంటే, ఆయన వ్యసనాన్ని అసహ్యించుకుంటూ వుంటే నా హృదయం తల్లడిల్లి పోతూ వుండేది. కాని ఏం చెయ్యగలను? నా అశక్తతని ఎవరితో చెప్పుకోను? ఆయన మరణంతో ఇప్పుడు చెప్పుకోడానికి ఏంలేదు. కాని ఒకటి నిజం– నిత్యం నేను అనుభవిస్తూవుండే ఆవేదననించి, తపననించి, నా కళ్ళు వర్షించే కన్నీరునించి ఇన్నాళ్ళకి నాకు విముక్తి కలిగిందేమోననిపిస్తోం దండీ! భర్తృ విహీననయ్యానని, నా పసుపు కుంకుమలు పోయాయన్న తపన లేకపోలేదు. నేనిలా అంటున్నందుకు మీరు నన్ను అసహ్యించుకో వచ్చు, నన్ను దూషించవచ్చు. భారతనారిగా భర్తను అగౌరవపరుస్తున్నా నని మీరు నన్ను నిందించవచ్చు. కాని కాని.... నా మనసులోని అలజడి, నా అనుభూతుల్ని వ్యక్తం చేశాను. బండబారిన నా గుండెల అట్టడుగు పొరలోంచి వస్తోన్న మాటలివి. మీరే అర్థం చేసుకోండి" రుద్ధ స్వరంతో అంటుంటే, ఆమె స్వరం అక్కడక్కడ కీచుమంది. చెమర్చిన కళ్ళను ఒత్తుకుంది.

గోవిందు స్నేహితులు నివ్వెరపోయారు. విస్మయంతో పరస్పరం మొహాలు చూసుకున్నారు. ఆమె చెప్పిందాంట్లో అసత్యం ఏమీ లేక పోయినా, చెప్పిన తీరు మరీ కటువుగా వుందనిపించింది వారికి. ఆమె హృదయం ఎంత దెబ్బతిని వుండకపోతే అలా చెప్పగలుగుతుంది– అనుకున్నారు ఎవరి మనసున వారు.

క్షణం నిశ్శబ్ద వాతావరణం.

సుశీల మళ్ళీ అందుకుంది– "మీరంతా నా సోదరుల్లాంటివారు. మీరూ ఆలోచించండి ...నేనెందుకిలా అంటున్నానో! నా బాధను అర్థం

చేసుకోండి. నాలాంటి దురదృష్టవంతులింకా ఎందరో వున్నారు. నాలానే అవస్థలు పడుతున్నారు. ఆవేదన చెందుతున్నారు. కాని, నాలా ధైర్యంగా మనసులోని మాటను చెప్పడానికి సాహసించరు. సాంప్రదాయం అడ్డొస్తుంది. అదే ఆడదానికి శత్రువవుతోంది. మమ్మల్ని ఆదుకుందుకు మీరు ముందుకొచ్చారు. మీ ఔదార్యానికి, విశాల హృదయానికి మరోసారి ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను నన్ను అపార్థం చేసుకోకండి. అబ్బాయి వుద్యోగం కోసం ప్రయత్నించండి" నిశ్చలంగా అంది సుశీల.

"వస్తామమ్మా! అప్పుడప్పుడూ అబ్బాయిని ఆఫీసుకి పంపుతూ వుండండి" అంటూ వాళ్ళు నిష్క్రమించారు.

సుశీల భారంగా నిట్టూర్పు విడుస్తూ కళ్ళొత్తుకుని తలుపువేసింది. ఇప్పుడామెకి గుండెల్లోని బరువు తగ్గినట్టయింది.

* విపుల, మాసపత్రిక *